మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# సీఎం జిల్లాస్థాయి కప్ పోటీలు ప్రారంభించిన కలెక్టర్



కీడలను ప్రారంభించిన కలెక్టర్

**గద్వాల ప్రతినిధి,మే 22 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియంలో గద్వాల సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడలకు అధ్యక్షురాలుగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ సృజన, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సరిత, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ క్రీడలు ప్రతి విద్యార్థికి మానసిక ఉల్లాసంతో పాటు ధృడంగా తీర్చిదిద్దుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం సీఎంకప్ పేరిట జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మంచి కీర్తి ప్రతిష్టలు తేవాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులతో పాటు అన్ని మండలాల క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

# మే25న జడ్చర్లలో భారీ బహిరంగ సభ

**- ఏర్పాట్లను పరిశీలించిన టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లురవి, ఎర్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 22, ప్రభాతవార్త :** సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఈనెల18న నవాబుపేట మండలం రుక్కంపల్లిలో భట్టి అస్వస్థత కారణంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఆయనకు ఆరోగ్య పరీక్షలు చేసిన వైద్యులు శరీరంలో షుగర్ లెవల్స్ తగ్గాయని, నిరంతరంగా ఎండకు పాదయాత్ర చేస్తుండడంతో విశ్రాంతి అవసరమని వైద్యులు తెలిపారు. రుక్కంపల్లిలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర భారీ బహిరంగ సభను జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు సభకు విజయవంతం చేసేందుకు పెద్ద సంఖ్యలో జనసమీకరణ చేసేందుకు నేతలు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి, ఎర్రశేఖర్, ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి జడ్చర్లలో పరిశీలించారు. డా.బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణలో సభాస్థలాన్ని పరిశీలించారు. పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మల్లు రవి, ఎర్రశేఖర్, అనిరుధ్‌రెడ్డి

# ప్రముఖ సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి

**జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**గద్వాల ప్రతినిధి,మే 22 ప్రభాతవార్త :** ప్రముఖ సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రముఖ సంఘసంస్కర్త దళిత దీన జనోద్ధారకుడు భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 22.05.1888న జన్మించారని, రాష్ట్రంలోనే కాక దేశంలోనే గొప్ప సంఘ సంస్కర్తగా పేరొందారని దళిత ఉద్యమ వైతాళికుడు బాల్యంలోనే రెడ్డి అనే పెట్టారని, దళితుల అభివృద్ధి కోసం, నిరక్షరాస్యత, జోగిని దురాచారాన్ని, జంతుబలి తదితర దురాచారాలకు వ్యతిరేకంగా ప్రచారం కొనసాగించారని ఆయన సేవలను ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి శ్వేతప్రియదర్శిని,ఆర్డీఓ రాములు, డిపిఆర్ఓ చెన్నమ్మ, ఏఓ యాదగిరి, రాజు, మదన్‌మోహన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్‌వల్లూరు క్రాంతి

# తెలంగాణ రాష్ట్రం, దేశంలోనే రోల్ మాడల్‌గా నిలుస్తుంది:ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

**నారాయణపేట ప్రతినిధి,మే 22 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం కాన్‌కుర్తి గ్రామంలో సోమవారం రూ. 16 లక్షలతో నిర్మించిన పల్లెదవాఖానను ప్రారంభించారు. రూ.15 లక్షలతో మహిళా సంఘ భవనం, 10 లక్షలతో గ్రంథాలయ భవనం, రూ. 25 లక్షలతో జడ్పీ పాఠశాల ప్రహరీగోడ, మరుగుదొడ్లు, సిసి రోడ్ల పనులకు శంకుస్థాపనలు, 126 మంది లబ్ధిదారులకు 105 ఎకరాల భూమి పట్టాల పాస్ పుస్తకాలు, 22 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలను కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులతో పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తున్నాయని, ప్రతి ఇంటికి త్రాగునీరు, రైతుబంధు, రైతు భీమా, నిరంతర విద్యుత్, పంట పొలాల నుండి వరి కొనుగోళ్ల వంటి కార్యక్రమాలు చేపడుతూ గ్రామాలను అభివృద్ధి చేయడం జరుగుతున్నాయని తెలిపారు. సాగునీటికి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, పట్టాల పంపిణీ కోసం విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందిని కొనియాడారు. అలాగే పట్టాలు పొందిన లబ్ధిదా రులను అభినందించారు. కార్యక్రమాలలో సర్పంచ్ లక్ష్మి, ఎంపిపి నర్సప్ప, జడ్పీటిసి లావణ్య, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రామకృష్ణ, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ నరెందర్, మండల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కలెక్టర్

# 70ఏండ్లు పరిపాలించి తాగునీరివ్వలే..!

**స్వరాష్ట్రంలో మిషన్ భగీరథ ద్వారా ప్రతిరోజు తాగునీరు : ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మే 22 ప్రభాతవార్త :** 2014కు ముందు ఏనుగొండ బిసి కాలనీలో నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడేవారని, అలాంటిది ఇప్పుడు మిషన్ భగీరథ ద్వారా ప్రతిరోజు తాగునీరు అందిస్తున్నామని, తండాలో సైతం తాగునీరు అందిస్తున్నామని, దీంతోపాటు, బోర్లు ఏర్పాటు చేశామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పరిధిలోకి వచ్చే 3వ వార్డులోని ఏనుగొండలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు. 9.82 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన డ్వాక్రా భవనాన్ని మంత్రి ప్రారంభించారు. రూ. 6 లక్షల నిధులతో నిర్మించైనా సిసి రోడ్డును ప్రారంభించారు. డ్వాక్రా భవనంలో మహిళలనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాకపూర్వం మహబూబ్‌నగర్ పట్టణంలో 200ల రూపాయల చొప్పున 7 వేల మందికి పెన్షన్లు ఇస్తే తాము అధికారంలోకి వచ్చాక 20 వేల మందికి నెలకు 4 కోట్లపైనే పెన్షన్లను రూపేణా ఇస్తున్నామని మంత్రి తెలిపారు. అనారోగ్యం పాలైతే ఆసుపత్రికి వెళితే ఎన్నో అవస్థలు పడేవారని, అలాంటిది ప్రధాన ఆసుపత్రి రూపురేఖలు మార్చామని, మరో 500 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తున్నామని, వివిధ రకాల జబ్బులకు గురైన వారికి సిఎంఆర్‌ఎఫ్ కింద సహాయం అందించి ఆదుకుంటున్నామని తెలిపారు. మహబూబ్‌నగర్ నుండి హైదరాబాద్ వెళ్లేందుకు అప్పన్నపల్లి రైల్వే గేటు పడిన సందర్భంలో రోగులకు ఎంతో ఇబ్బంది కలిగేదని, అలాంటిది తాము అధికారంలోకి వచ్చాక కేవలం 12 నెలల్లో రెండో ఆర్‌ఓబిని నిర్మించామని, త్వరలోనే దానికి ప్రారంభిస్తామని, గతంలో మహబూబ్‌గర్‌లో ఒకపార్కు సైతం ఉండేది కాదని, ఇప్పుడు గల్లీ గల్లీకి పార్క్ అయిందని, శిల్పారామం, మిని ట్యాంక్ బండ్, నెక్లెస్‌రోడ్డు, కెసిఆర్ ఎకోపార్కు వంటివి మహబూబ్‌నగర్ వచ్చిన వారికి ఒకరోజు మొత్తం చూసేవిధంగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేశామని, దీంతోపాటు మన్యంకొండలో రోప్‌వేను ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడ చదివిన యువతకు ఇక్కడే ఉద్యోగాలు కల్పించేందుకు దివిటిపల్లి వద్ద ఐటి పార్కును ఏర్పాటు చేశామని, సంవత్సరంలోపే 20 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. విద్యార్థులు చదువుకునేందుకు 20 రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలను ఏర్పాటు చేశామని సమాజంలోని అన్ని వర్గాల వారికి అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసి బతుకుదెరువు కల్పించామని, ప్రత్యేకించి మహిళలకు బ్యాంకుల అనుసంధానంతో 356 కోట్ల రుణాలు ఇచ్చామని చెప్పారు.పట్టణం అభివృద్ధి వల్ల భూములు, ప్లాట్ల విలువలు పెరిగాయని, కరోనా సమయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా సరఫరా చేశామని, వీటన్నింటిని ప్రజలు గమనించాలని కోరారు. మున్సిపల్ ఛైర్మన్ కెసి నరసింహులు, ముడా ఛైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ హరికృష్ణ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళా భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# ఎప్పటికప్పుడే ధాన్యం కొనుగోలు చేయాలి: కలెక్టర్

**ప్రజావాణి అనంతరం అధికారులతో సమీక్ష..**
**భాగ్యరెడ్డి వర్మ చిత్రపటం వద్ద నివాళి..**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 22 ప్రభాతవార్త :** వర్షాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం మొత్తాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ ఆదేశించారు.కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యంపై ఏరోజుకారోజు ఖచ్చితమైన నివేదికను సమర్పించాల్సిందిగా ఆయన ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా వ్యవసాయ విస్తరణ అధికారులు నాణ్యత కలిగిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ధృవీకరణ జారీ చేయాలని,ఒకవేళ ఎవరైనా నాణ్యత ప్రమాణాలకు అనుకూలంగా లేని ధాన్యాన్ని ధృవీకరించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఆయన ప్రజావాణి సందర్భంగా సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్దనుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా, మండల స్థాయి అధికారులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రతిరోజు వస్తున్న ధాన్యంపై ఉదయం, సాయంత్రం ఖచ్చితమైన నివేదిక సమర్పించాలని, నాణ్యత ప్రమాణాలకు అనుకూలంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నారు. ప్రతిరోజు అక్కడక్కడ వర్షాలు పడుతున్నందున ఏరోజు ధాన్యాన్ని ఆరోజే కొనుగోలు చేసి పంపించాలని అన్నారు. జిల్లాలోని అన్ని మిల్లులలో విఆర్‌ఎలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సీజన్‌లో వర్షాలు,ఇతర సమస్యలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం కొనుగోలును త్వరగా పూర్తి చేయాల్సిందిగా ఆయన ఆదేశించారు. మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, తహసిల్దార్‌లు గ్రూప్ 4 పరీక్షలకు సంబంధించి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రజావాణి సందర్భంగా ఎప్పటిలాగే ఈ సోమవారం సైతం ప్రజల వద్దనుండి భూములకు సంబంధించిన విషయాలు, వ్యక్తిగత అంశాలు, ఉద్యోగ, ఉపాధికి సంబంధించిన అంశాలపై ప్రజలు ఫిర్యాదులు సమర్పించారు. కాగా చిన్నదర్పల్లికి చెందిన రెండున్నర సంవత్సరాల ఓరుగంటి మధు 11 జంతువులు, 8 పండ్లు, 10 పక్షులు, 7వాహనాలు, 5 ఆకారాలు,5 జాతీయ సింబల్స్, 14 రాష్ట్రాలు వాటి రాజధానులు, 3 రైమ్స్, 1 నుండి 10 అంకెలను రెండు సంవత్సరాల 7 నెలల వయసులోనే కంఠత చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డును సాధించినందుకు గాను జిల్లా కలెక్టర్ మధురను అభినందించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, జడ్పీ సీఈఓ జ్యోతి, ఆర్డీఓ అనిల్‌కుమార్, డిఆర్‌డిఓ యాదయ్య, జిల్లా అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం భాగ్యరెడ్డివర్మ 135వ జయంతిని పురస్కరించుకుని ఎన్‌ఐసి విషమందిరంలో ఏర్పాటు చేసిన భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, డిఆర్‌డిఓ యాదయ్య, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి మధుసూదన్‌గౌడ్, సాంఘిక సంక్షేమశాఖ ఇంఛార్జి డిడి పాండు, ఇతర జిల్లా అధికారులు పాల్గొని భాగ్యరెడ్డి వర్మకు నివాళులర్పించారు.



ప్రజావాణిలో ఫిర్యాదులను తెలుసుకుంటున్న కలెక్టర్



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

# పేద కుటుంబాల్లో సంతోషాలు నింపిన సీఎం కేసీఆర్..!

**- కళ్యాణలక్ష్మి పథకంలో ఎంతో కుటుంబాలకు భరోసా**

**- ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,మే 22 ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి కేసీఆర్ తీసుకొచ్చిన వరమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధనరెడ్డి అన్నారు. ఆంధ్రా వలస పాలకుల పాలనలో పేదింటి ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేయలేక తల్లి దండ్రులు తమ కుతూర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్న సందర్భాలు.తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వ కుంట్ల చంద్రశేఖర రావు పేదింటి ఆడపిల్లలు కలిగిన తల్లి దండ్రులు పడుతున్న కష్టాలను స్వయంగా చూసిన కేసీఆర్ ఆ కష్టాలను రూపుమాపేందుకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకాలను ప్రవేశ పెట్టి ఆత్మహత్యలను నివారించి బడుగు,బల హీన వర్గాలకు భరోసా కల్పిస్తున్న ఏకైక సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అని ఆయన కొనియాడారు.సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని గగ్గలపల్లి తేజా కన్వెన్షన్‌లో ఆర్డీఓ అధ్యక్షతన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి,షాదిముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60ఏళ్ల ఆంధ్రా వలస పాలకుల పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని విధాల వెనుకబాటు తనానికి గురైందని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం తెగించి రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామీగా ఉంచేందుకు అహర్నిశలు కృషి చేస్తూ పల్లెల అభివృద్ధికై ప్రత్యేక ప్రణాళికలు చేపట్టి అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకు వెళ్తున్నారని ఆయన అన్నారు. షాదిముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలను ప్రవేశ పెట్టి పేదింటి ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులకు బాసట గా నిలిచి ఆడపిల్లలకు మేనమామ కానుకగా రూ.1లక్ష అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎదిగిన ఆడపిల్లలకు వివాహాలు చేయలేక ఎంతో మంది ఆత్మబలిదానాలు చేసుకునే వారని, సీఎం కేసీఆర్ ఆ సంఘటనలను చూసి చలించి ఈ పథకాలను ప్రవేశ పెట్టారని ఆయన గుర్తుచేశారు.పల్లెలఅభివృద్ధి,పల్లెలను పరిశుభ్రత, పచ్చదనంగా మార్చేందుకు సీఎం కేసీఆర్ డంపింగ్‌యార్డ్‌లు, స్మశాన వాటికలను ఏర్పాటు చేయడంతో పాటు చెత్త చెదారాన్ని తరలించేందుకు ట్రాక్టర్లను ప్రతి గ్రామ పంచాయతీకి అందిస్తున్నారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి రైతు, ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పర్చేందుకు ఎకరానికి రూ.5వేలను రైతుబంధు క్రింద అందించడంతో పాటు ప్రమాదవశాత్తు మృతి చెందిన రైతు కుటుంబాన్ని ఆదుకోవడానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను అందించి రైతు పక్షపాతిగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ అని అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తూ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పర్చడంతో రైత న్న కష్టలను కడతేర్చి అప్పుల బాధ నుంచి రైతులను విముక్తి చేస్తున్నారని ఆయ న అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకా లను ప్రవేశ పెట్టారని, వృద్ధులకు, వికలాంగులకు, వితంతవులకు, ఒంటరి మహి ళలకు పెన్షన్ అందిస్తూ మూడు పూటల భోజనాన్ని అందిస్తు పెద్ధ కొడుకులా నిలుస్తున్నారన్నారు.నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించి, ఎంజెఆర్ చారిటబుల్ ట్రస్ట్‌లో వివాహా చేసుకున్న మొత్తం 278 మంది లబ్ధిదా రులకు చెక్కులను ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అందించారు. అనంతరం సహ పంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ట్రస్టీ మర్రి జమున, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

# బాధితులకు అండగా ఉంటాం: ఎస్పీ నరసింహ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 22, ప్రభాతవార్త :** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల సమస్యల పరిష్కారానికి బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ చర్యలు తీసుకుంటున్నామని మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ అన్నారు. జిల్లాపోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదులు స్వీకరించారు.12ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడారు.బాధితులకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యం,అలసత్వం ప్రదర్శించొద్దని పోలీస్ అధికారులను హెచ్చరించారు.బాధితుకుల తప్పనిసరి న్యాయం జరుగుతుందని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్ర తల పరిరక్షణకు భంగం కలిగించేవారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారు లను ఆదేశించారు. ఫిర్యాదుదారులు సివిల్ వివాదాలు కోర్టులోనే పరిష్కరించు కోవాలని సూచించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

# అంబేద్కర్ రాజ్యాంగం వల్లే విద్య, ఉద్యోగాలలో రాజకీయాల్లో రిజర్వేషన్లు..

**కొండేరులో అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటు**

**హాజరై ప్రారంభించిన ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి, జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి**

**ఇటిక్యాల,మే22 ప్రభాతవార్త:**భారత రాజ్యాంగ సృష్టికర్త డా.బిఆర్ అంబేద్కర్ కుల నాయకుడు కాదని ప్రపంచ మేధావి అని ఆయన రాసిన రాజ్యాంగం వల్లే దేశంలో అన్ని కులాల వారికి విద్య, ఉద్యోగాలలో, అదేవిధంగా రాజకీయ రిజర్వేషన్లు, అంతేకాక మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు, స్త్రీలకు ఓటు హక్కు కల్పించడంలో అంబేద్కర్ కృషి చేశారని అంబేద్కర్ అదేవిధంగా భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ పోరాట వీరుడని 1977లో ఇందిరాగాంధి ప్రభుత్వం ఎమర్జెన్సీ సమయంలో వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం పోరాడారని ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద జగన్నాథం, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసిం, అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు గిన్నిస్ బుక్ ఆఫ్ అవార్డు గ్రహీత రాజు ప్రజలకు వివరించారు. సోమవారం మండల పరిధిలోని కొండేరు గ్రామంలో ఢిల్లీ అధికార ప్రతినిధి మాజీ ఎంపి మంద జగన్నాథం ముందుకొచ్చి గ్రామ ప్రజల సహకారం, తన సొంత ఖర్చులతో మహనీయులైన భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్‌ల నిలువెత్తు విగ్రహాలు ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద జగన్నాథం, జడ్పీ ఛైర్మన్ సరిత, ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి, ఉస్మానియా యువజన సంఘం వ్యవస్థాపకులు గిన్నిస్ బుక్ ఆఫ్ అవార్డు గ్రహీత జేబి రాజు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఖాసిం, దళితవార్డు గ్రహీత జేబి రాములు మాట్లాడుతూ డా.బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మార్చడానికి కేంద్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఇప్పటికి రాజ్యాంగం సక్రమంగా కొన్ని రాష్ట్రాలలో అమలు కావడం లేదని అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి అందరం కలిసికట్టుగా పోరాడి కాపాడుకోవాలని ప్రజలకు వివరించారు. అంతేకాక అంబేద్కర్ ప్రపంచ మేధావి అనిగుర్తింపు తెచ్చుకున్నారని లండన్ దేశంలో పై చదువులు చదువుకున్న దేశంలో ఒకే వ్యక్తి అంబేద్కర్ అని గుర్తు చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే అన్ని కులాల వారికి విద్య, ఉద్యోగాలలో, రాజకీయ రంగంలో అలాగే వర్టికల్ 3 ప్రకారం చిన్న రాష్ట్రాల ఏర్పాటు, మహిళలకు ఓటుహక్కు కల్పించడం, చట్ట సభల్లో రిజర్వేషన్లు అమలు కావడం జరుగుతుందని భారతదేశానికి స్వాతంత్రం రాకమునుపు బ్రిటిష్ ప్రభుత్వంతో భారతదేశానికి స్వాతంత్రం ఇవ్వాలని గట్టిగా మాట్లాడారని 3 సంవత్సరాల కాలంలోపే అంబేద్కర్ రాజ్యాంతం రాజ్యాంగాన్ని రచించినట్లు ఆయన వివరించారు. అంతేకాక భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ పోరాట వీరుడని ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని జైలుకు వెళ్లాడని 1977లో ఇందిరాగాంధి ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించిన సమయంలో ఇందిరాగాంధికి వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం పోరడారని రైల్వేశాఖ మంత్రిగా ఉన్న సమయంలో దళితులకు ఎంతో మేలు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత, మాజీజడ్పీ ఛైర్మన్ బండారు భాస్కర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్, భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని అలాగే రాజ్యాంగం ప్రకారం తెలంగాణ ప్రభుత్వం అన్ని కులాల వర్గాల వారికి విద్య, ఉద్యోగాలు, రాజకీయ రిజర్వేషన్లు, పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. కొండేరు గ్రామంలో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసినందుకు వారు అభినందించారు. కళాకారుల బృందం ఆధ్వర్యంలో డా.బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌లు చేసిన కృషిని పాటల ద్వారా ఆటపాటలతో ప్రజలను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ బిఆర్ఎస్ పార్టీ మాజీ ఇంఛార్జి మంద శ్రీనాథ్, మాజీ జడ్పీ ఛైర్మన్ బండారి భాస్కర్, పెబ్బేరు జడ్పీటిసి పద్మ, స్థానిక మండల జడ్పీటిసి హనుమంత్‌రెడ్డి, ఎంపిపి స్నేహ శ్రీధరరెడ్డి, సీనియర్ నాయకులు పటేల్ విష్ణువర్ధన్‌రెడ్డి, వడ్డేపల్లి మాజీ జడ్పీటిసి శ్రీనివాసులు, తిరుపతయ్య, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాందేవ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, చంద్రహాస్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఇస్మాయిల్, బొంకూర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆత్మలింగారెడ్డి, రవిందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పోతురాజు, సోమనాద్రి, అనంతరెడ్డి, కిశోర్, రవిప్రకాష్, స్థానిక సర్పంచ్ ఈరన్న, గ్రామ నాయకుడు బొట్టు వీరన్న, అంజి, రామ్‌రెడ్డి, కుర్వ పుల్లయ్య,ఏకాంత్ దుబ్బన్న, దానం బషీర్‌మియా, శ్రీనాథ్‌రెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు యోహాన్, బీసన్న, సభ్యులు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాలను ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న మంద జగన్నాథం



మాట్లాడుతున్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ॥ కాసిం

## అవోపా ఆధ్వర్యంలో షీ టీం అవగాహన సదస్సు

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 22, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో అవోపా ఆధ్వర్యంలో వీణా శివకుమార్ అధ్యక్షతన షీ టీం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షీ టీం బృందం సభ్యులు మాట్లాడుతూ టీం ఎలా పని చేస్తుందో, ఎలా ఫిర్యాదు చేయాలి, కౌన్సెలింగ్ , ఉపయోగాలపై మహబూబ్‌నగర్ షీ టీం బృందం వివరించింది. ఇలాంటి అవగాహన సదస్సు కల్పించినందుకు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. నిత్య జీవితంలో ఎదుర్కొనే సమస్యలపై ఎలా స్పందించాలో చాలా క్షుణ్ణంగా నేర్చుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా అవోపా అధ్యక్షుడు ఎలిశెట్టిమురళీకృష్ణ మాట్లాడుతూ సదస్సుకు సుమారు 200 మంది బాలికలు, మహిళలు హాజరయ్యారని తెలిపారు. అవోపా నుంచి గత పన్నెండేండ్లుగా జడ్చర్లలో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యేడాది స్థానిక ఉదయ్ మెమోరియల్ పాఠశాలలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత పాలాది రామ్మోహన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

## మండల కేంద్రంలో భాగ్యరెడ్డివర్మ 135వ జయంతి

**గండీడ్,మే 22 ప్రభాతవార్త :** దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డివర్మ మే 22,1888 జన్మించారు. ఫిబ్రవరి 18 1939 సంఘ సంస్కర్త, ఆది ఆంధ్రసభ స్థాపకుడు 1906,1933 మధ్య హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశాడు. జగన్ మిత్రమండలి, మన్యసంఘం, సంఘ సంస్కార నాటక మండలి, అహింసా సమాజంలను స్థాపించి హైదరాబాద్ ప్రాంతంలో సంఘసంస్కరణలకై కృషి చేశాడు. మాదిరి వెంకయ్య, రంగమాంబ దంపతులకు 1888 సంవత్సరం, మే 22వ తేదీన రెండవ సంతానంగా జన్మించిన భాగయ్య, ఆ తర్వాత కాలంలో తన పేరును భాగ్యరెడ్డిగా మార్చుకున్నాడు. 1888 నవంబర్‌లో వారి కుటుంబ గురువును సందర్శించడానికి వచ్చి పిలలవానికి భాగయ్యకు బదులు భాగ్యరెడ్డి అని నామకరణం చేశారు. సమాజ మార్పుకోసం తన జీవితాన్ని త్యాగం చేశాడు. కార్యక్రమంలో కప్లాపూర్ మాజీ ఎంపిటిసి ఆశన్న, ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బోరు కృష్ణయ్య,గండీడ్ మండలం అంబేద్కర్ సంఘం అధ్యక్షులు గుముడాల చెన్నప్ప, వెన్నచేడ్ సంజయ్, హస్నాబాద్ వెంకటయ్య, హస్నాబాద్ చంద్రయ్య, జక్లపల్లి మొగులయ్య, మల్కయ్య,కోట్యానాయక్, సొక్కంపేట కేశవులు, చెన్నయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.


భాగ్యరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

## రైతుభీమా చెక్కు అందజేసిన ఎమ్మెల్యే..

**గద్వాల ప్రతినిధి,మే 22 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కెటిదొడ్డి మండల పరిధిలోని కుచినెర్ల గ్రామానికి చెందిన భీమయ్య మరణించారు. వారి కుటుంబ సభ్యులకు భార్య దేవమ్మకు ప్రభుత్వం తరపున ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా రైతుభీమా ద్వారా 5 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఆపద స్థితిలో ఉన్న మమ్మల్ని ఆదుకున్నందుకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రికి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లాగ్రంథాలయ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ్, ఎంపిపి విజయ్, జడ్పీటిసి రాజశేఖర్, వైస్ ఎంపిపిలు రామకృష్ణనాయుడు,సుదర్శన్‌రెడ్డి,కౌన్సిలర్లు మురళినాగిరెడ్డి,నరహరి,శ్రీనివాసులు, శ్రీను, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కోటేష్, హరిప్రసాద్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


రైతుభీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

## ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 22 ప్రభాతవార్త:** తాడూర్ మండలం చర్ల తిర్మలాపూర్ గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పర్యటించారు. గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు కాలనీల్లో పర్యటించిన ఎమ్మెల్యే దృష్టికి సీసీ రోడ్లు లేవని తీసుకొని రావడంతో స్పందించిన ఆయన త్వరలోనే గ్రామంలో సీసీ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అదే విధంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణపనులు చేపడుతానని హామీ ఇచ్చారు. ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న పలువురిని పరామర్శించి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకొని మెరుగైన వైద్య సేవలకు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.


గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

## విధుల్లో ఆర్టీఓ తనయుడు...

**- మామిడి పండ్ల వాహన తరలింపు నుంచి అక్రమంగా మామిడిపండ్ల వసూళ్లు...**

**- డిపో మేనేజర్ సమక్షంలో తతంగం**

**వెల్దండ, మే 22 ప్రభాతవార్త:** ప్రభుత్వాధికారులు నికచ్చిగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉండాలే కానీ నిబంధనలు తుంగలో తొక్కి తానే బాస్‌గా వ్యవహరిస్తున్నాడు అధికారి. వెల్దండ మండలం హైదరాబాద్–శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై కొట్ర జంక్షన్ వద్ద కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్, సిబ్బంది, ఆర్టీఏ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ప్రైవేటు వాహనాల తనిఖీలో భాగంగా ఆర్టీఓ అధికారి తనయుడు విధులు నిర్వరిస్తూ ప్రభాతవార్త కథనానికి చిక్కాడు. వివరాల్లోకి వెళితే... కల్వకుర్తి డిపో మేనేజర్ సమక్షంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా ఆర్టీఓ అధికారి తనయుడు కట్టె చేతపట్టుకొని వాహనాలను ఆపడంతో హైదరాబాద్‌కు తరలిస్తున్న మామిడిపండ్లను అక్రమంగా మామిడి పండ్లను వసూలు చేస్తూ ఆర్టీఓ అధికారి కారులో స్టోరేజ్ చేస్తున్నాడు. ఈ తతంగమంతా ఆర్టీసీ డిపో మేనేజర్ సమక్షంలోనే నడుస్తున్నది. ఈ తతంగాన్ని చూసిన పాత్రికేయులు ప్రశ్నించగా... వారిపై ఆర్టీఓ అధికారి తనయుడుతో పాటు కల్వకుర్తి డిపో మేనేజర్ దురుసుగా ప్రవర్తించారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.



మామిడి పండ్లను వసూలు చేస్తున్న ఆర్టీఓ అధికారి తనయుడు

## క్రీడాకారులకు చేయూత...

**వెల్దండ, మే 22 ప్రభాతవార్త:** సీఎం కప్‌లో భాగంగా జిల్లా స్థాయి ఆటలకు ఎంపికై పోటీల్లో పాల్గొనడానికి వెళ్తున్న క్రీడాకారులకు ఎంపీపీ విజయజైపాల్‌నాయక్ రూ.10వేలు విలువ చేసే క్రీడా దుస్తులు, వైస్ ఎంపీపీ శాంతిగోపాల్‌నాయక్ రూ.5వేలు రవాణా ఖర్చులకు క్రీడాకారులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో పోటీకి ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయిలో రాణించి మండలానికి మంచి పేరు తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, పీఈటీ రవీందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న వైస్ ఎంపీపీ

# ఆర్‌ఓబి సర్వీసురోడ్ల మరమ్మతులు పూర్తిచేయాలని బీజేపి ఆందోళన

### -దేవరకద్ర ఆర్‌ఓబిపై బీజేపి రాస్తారోకో

**దేవరకద్ర,మే 22 ప్రభాతవార్త:** అసంపూర్తిగా ఉన్న దేవరకద్ర ఆర్‌ఓబి సర్వీసురోడ్ల మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని దేవరకద్రలో సోమవారం బీజేపి నాయకులు ఆంధోళన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నూతన ఆర్‌ఓబి వంతెనపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి బిజేపి మండల అధ్యక్షుడు కొండ అంజన్‌కుమార్‌రెడ్డి ప్రసంగించారు. సర్వీసురోడ్లు పూర్తి కాకపోవడంతో వాహనదారులు ఆర్‌ఓబిపైకి ఎక్కేటప్పుడు,దిగేటప్పుడు చాలా ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. దీని వల్ల ప్రమాదాలు కూడ జరుగుతున్నాయన్నారు. అలాగే ఆర్‌టీసి బస్సులు బస్టాండులోకి వెళ్ళడం లేదన్నారు. బస్సులు బస్టాండులోకి రాకపోవడంతో ప్రయాణికులు వంతెలకు ఇరువైపులకు నడచుకొంట వెళ్ళి మరి బస్సులను ఎక్కాల్సి వస్తుందన్నారు. దీని వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. అంతేగాకుండా వంతెనపై లైట్లను కూడ ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళ వంతెనపై చిమ్మచీకటిగా ఉంటుందన్నారు. అయినా ఎవరు కూడ పట్టించుకోవడం లేదన్నారు. ఆర్‌ఓబి సర్వీసురోడ్ల మరమ్మతులు చేపట్టిన తరువాత వంతెనను ప్రారంభించాల్సి ఉండగా వాటిని ఏమి పట్టించుకోకుండా ఆగమేఘాల మీద వంతెనను ప్రారంభించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఆర్‌ఓబి సర్వీసురోడ్ల మరమ్మతులను వెంటనే పూర్తి చేయని పక్షంలో బిజేపి ఆంధోళనను ఉధృతం చేస్తుందన్నారు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ వెంకటేశ్ తమ సిబ్బందితో వచ్చి నచ్చచెప్పడంతో నాయకులు తమ ఆంధోళనను విరమించారు. ఆర్‌ఓబి వంతెనపై రాస్తారోకో చేయడంతో ఇరువైపుల వాహనాలు బారులు తీరి నిలబడ్డాయి. ఈ కార్యక్రమంలో మండలంలోని బిజేపి నాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


దేవరకద్రలో రాస్తారోకో చేస్తున్న బిజేపి నాయకులు


నినాదాలిస్తున్న కొండ అంజన్‌కుమార్‌రెడ్డి

## ఎమ్మెల్యే దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు


ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న దృశ్యం


ఎమ్మెల్యే దంపతులకు కేక్ తినిపిస్తున్న దృశ్యం

**గద్వాల ప్రతినిధి,మే 22 ప్రభాతవార్త :** పట్టణంలోని గద్వాల ఎమ్మెల్యే దంపతులు బండ్ల జ్యోతి కృష్ణమోహన్‌రెడ్డికి పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులకు గజమాల శాలువాతో ఘనంగా సత్కరించి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి పెళ్లిరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఎల్లప్పుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్ల సుఖ సంతోషాలతో జీవించాలని భగవంతుడిని మనస్పూర్తిగా కోరుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మున్సిపల్ కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే దంపతులకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు బండ్ల సాయి సాకేత్‌రెడ్డి, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపిపి విజయ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాబర్, ఉమ్మడి జిల్లా కెటిఆర్ యువసేన ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్‌రెడ్డి, గద్వాల టౌన్ పార్టీ అధ్యక్షుడు గోవిందు, ఆలయ కమిటి ఛైర్మన్ సతీష్, కౌన్సిలర్లు మురళి, నాగిరెడ్డి, నరహరి, శ్రీనివాసులు, దౌలు, శ్రీను, మహేష్, కృష్ణ, నరహరిగౌడ్, నాగరాజు, గద్వాల టౌన్ పార్టీ ప్రధాన కార్యదర్శి సాయిశ్యాంరెడ్డి, ఉపాధ్యక్షుడు ధర్మనాయుడు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కోటేష్, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణశెట్టి, నాగులు యాదవ్, రంజిత్, రిజ్వాన్, భానుప్రకాష్‌రెడ్డి, మోబిన్, నర్సింహులు,గోవిందు, జగదీష్, కృష్ణ, చిన్నశివశంకర్, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## వాల్మీకి, బోయల సంక్షేమంపై ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి

### మండల నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు విష్ణు

**మల్దకల్,మే 22 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వాల్మీకి బోయ కులస్తులు అత్యధికంగా ఉన్నారని అయితే వీరికి ఎలాంటి ప్రత్యేక వృత్తులు లేవని గతంలో సంచార జాతులుగా ఉన్నటువంటి వాల్మీకి, బోయలకు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించి అర్హత కలిగిన 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి వీరి ఉపాధి, సంక్షేమంకై రెండు లక్షల రూపాయలను కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ సోమవారం మల్దకల్ మండల తహసిల్దార్ హరికృష్ణకు నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు విష్ణు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ప్రభుత్వము రాష్ట్రంలోని కులవృత్తుల ఆధారంగా ఆయా కులాల సంక్షేమంకై పలు పథకాలను ప్రవేశపెట్టిందని, కానీ ఎలాంటి ప్రత్యేక వృత్తిలేని వాల్మీకి, బోయ కులస్తులకు ఎలాంటి సంక్షేమ పథకాన్ని అమలు చేయడం లేదని కావున రాష్ట్ర ప్రభుత్వవ వెంటనే ప్రత్యేక ఫెడరేషన్ ద్వారా నిధులు కేటాయించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రెండు లక్షల రూపాయలను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లవన్న,మండల ఉపాధ్యక్షులు ప్రేమ్‌రాజ్, నజుముల్లా, నాయకులు ఉప్పరి కృష్ణ, హనుమేష్, నాగర్‌దొడ్డి కృష్ణ, మీసాల కిష్టన్న, గోపాల్, లక్ష్మన్న,తిరుపతన్న, తిమ్మప్ప, ఆశన్న, నేతన్న, ఆంజనేయులు, తిరుమలేష్, వెంకట్‌రాములు, గట్టు మండల అధ్యక్షుడు బలరాంనాయుడు, భూపతినాయుడు, ఎల్కూర్ బీసన్న,లక్ష్మన్న, నరసింహులు పాల్గొన్నారు.



తహసిల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## గూరకొండలో కొనసాగుతున్న గ్రామదేవతల ప్రతిష్టాపన మహోత్సవాలు..


గూరకొండలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**దేవరకద్ర,మే 22 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గూరకొండలో సోమవారం గ్రామదేవతల ప్రతిష్టాపన మహోత్సవాలు ముమ్మరంగా కొనసాగాయి. ఈ నెల 21 ఈ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామంలో ఈ సందర్భంగా గ్రామదేవతలైన పోచమ్మ అమ్మవారు, ఊరలక్ష్మమ్మదేవి, గజ్జలమ్మ, కోటమైసమ్మ, నాభిశిల(బోడ్రాయి)లను ప్రతిష్టంచనున్నారు. ఈసందర్భంగా మహోత్సవాల రెండవరోజు యంత్రప్రతిష్టాపన పూజా కార్యక్రమాలను సాంప్రదాయరీతిలో నిర్వహించారు. అలాగే వివిధ హోమాలతో పాటు నేత్రోన్మిలనం, అష్టదిక్పాలకులకు బలిహారం, పూర్ణాహుతిలతో పాటు వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వమించారు. ఈ సందర్భంగా వివిధ దేవతామూర్తుల గుళ్ళను మామిడితోరణాలతో పాటు రంగురంగుల విధ్యుత్‌బల్బులతో శోభాయమానంగా అలంకరించారు. మహోత్సవాలను పుసరస్కరించుకొని ఆడపడచులంతా పుట్టింటికి రావడంతో ఏ ఇంట్లో చూసిన వారి సందడే కనిపించి ంది. ఈ పూజా కార్యక్రమాలకు గ్రామస్థులు అధికసంఖ్యలో హాజరయ్యారు. దీంతో గూరకొండ భక్తిపారవశ్యంతో పులకించి పోయింది. ఒక్కసారిగా పవిత్ర వాతావరణం నెలకొంది.

**నేడు బోనాల వేడుక..**

దేవరకద్ర మండలం గూరకొండలో గ్రామదేవతల ప్రతిష్టాపన మహోత్సవాల సందర్భంగా మంగళవారం బోనాల వేడుకను నిర్వహించనున్నారు. అలాగే వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. దీంతో గ్రామంలో గ్రామదేవతల ప్రతిష్టాపన మహోత్సవాలు ముగుస్తాయి.

## కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భీమాపై అవగాహన


భీమాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కెటిదొడ్డి,మే 22 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నందిన్నె గ్రామంలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డికె అరుణ భరత సింహారెడ్డి ఆదేశాల మేరకు గద్వాల వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ నందిన్నె ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో గడప గపడకు బిజెపి ఇంటింటికి అరుణమ్మ అనే నినాదంతో ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజన, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, పథకాల గురించి నందిన్నె గ్రామంలో79,80,81,82 బూత్ కమిటీలలో ఇంటింటికి తిరిగి పథకాల గురించి ప్రజలకు క్లుప్తంగా వివరించి ప్రతి ఇంటికి స్టిక్కర్ అతికించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్,వార్డు సభ్యులు, బూత్ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

## మత్స్య సహకార సంఘం ఎన్నికలు..

**కెటిదొడ్డి,మే 22 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నందిన్నె గ్రామంలో ప్రాథమిక మత్స్య సహకార సంఘం ఎన్నికలు రాజునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడు రొడ్డబోయిన రాఘవేంద్ర, ఉపాధ్యక్షులు దుబ్బ గోకారప్ప,కార్యదర్శి గొక్కు పరశురాములు,డైరెక్టర్లు పెద్దరాములు,గోసిరాములు,ఆటోరాములు, పటేల్ మల్లేష్,పటేల్ వెంకటేష్,తెలుగు శ్రీనివాసులును ఎన్నికల అధికారి రాజునాయక్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా గద్వాల సొసైటీ అధ్యక్షులు వెంకట్రాములు, దబ్బ నర్సింహులు పాల్గొని నూతనంగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మత్స్యకారులు,పెద్దలు పాల్గొన్నారు.


ఏకగ్రీవంగా ఎన్నికైన మత్స్య సహకార సంఘం నాయకులు

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ ధరలు

**దేవరకద్ర,మే 22 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం 227 కింటాళ్ళ సోన ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితే కింటాల్ సోన ధాన్యానికి అత్యధికంగా రూ.2083 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.1489 ధర పలికింది. అలాగే 74 కింటాళ్ళ హంస ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ హంస ధాన్యానికి అత్యధికంగా రూ.1579 ధర పలికింది. అలాగే అతితక్కువగా రూ.1469 ధర పలికింది. అలాగే 22 కింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ ఆముదాలకు అత్యధికంగా రూ.5329 ధర పలికింది. అతి తక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## ఫీడర్‌ఛానల్ పనులు పరిశీలించిన ఈఓ



**దేవరకద్ర,మే 22 ప్రభాతవార్త:** దేవరకద్రలో సోమవారం ఫీడర్‌ఛానల్ పనులను స్థానిక ఈఓ సీత్యానాయక్ పరిశీలించారు. దేవరకద్రలో గత కొన్నిరోజులుగా ఫీడర్‌ఛానల్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అందులో భాగంగానే స్థానిక పెద్దచెరువు నుండి దోశయ్యబావి వరకు జరిగే ఫీడర్‌ఛానల్ పనులను ఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు ఆయన పలు సూచనలు ఇచ్చారు.

## ఫ్యాక్టరీ మూసివేయాలని వినతి పత్రం

### కెమికల్ ఫ్యాక్టరీ నిమిత్తం ఎండిని కలిసిన మహేష్ అన్న



**గండీడ్,మే 22 ప్రభాతవార్త :** గండీడ్ మండలం, దేశాయ్‌పల్లి గ్రామ సమీపంలో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీ వల్ల అనారోగ్యంతో పాటుగా వాతావరణం కలుషితమవుతుందని గ్రామస్తులు ఎమ్మెల్యే మహేశ్వంరెడ్డితో పాటు టిఎస్ ఏఐడిసి ఎండి వెంకట్ నర్సింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఫ్యాక్టరీ మూసివేయాలని వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు, బిఆర్ఎస్‌పార్టీనాయకులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేసి గృహలక్ష్మి పథకంలో మొదటి ప్రాధాన్యత కల్పిస్తాము:ఎమ్మెల్యే సతీమణి



**గద్వాల ప్రతినిధి,మే 22 ప్రభాతవార్త :** ఇటీవలే గద్వాల పరిధిలోని లత్తిపురం గ్రామానికి చెందన మాలపెద్ద రంగన్న, లక్ష్మిల గుడిసె విద్యుత్ షాక్ గురై కాలిపోయింది. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వారికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం ఎమ్మెల్యే సతీమణి బండ్లజ్యోతి, తనయుడు బండ్ల సాకేత్‌రెడ్డిల చేతుల మీదుగా అందజేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకంలో మొదటి ప్రాధాన్యత కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, పార్టీనాయకులు రాజారెడ్డి, వీరేష్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ను నివారిద్దాం... మున్సిపాలిటి అభివృద్ధికి కృషి చేద్దాం...



**కల్వకుర్తి, మే 22 ప్రభాతవార్త:** ప్లాస్టిక్‌ను నివారిద్దాం.. మున్సిపాలిటి అభివృద్ధికి కృషి చేద్దామని కౌన్సిలర్ తలసాని సౌజన్య జనార్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్వకుర్తి మున్సిపాలిటిలోని వాసవీనగర్‌లో తడి, పొడి చెత్త మరియు హానికరమైన చెత్త గురించి కాలనీలో పర్యటించి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి జూట్ బ్యాగులను వాడాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

## తెలంగాణ వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ..

**- పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 22, ప్రభాతవార్త :** తెలంగాణ వైతాళికుడు మాదరి భాగ్యరెడ్డి వర్మ జాతీయ స్థాయి ప్రముఖుడిగా గుర్తింపు తెచ్చుకున్న తెలంగాణ బిడ్డ అని పీయూ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ కొనియాడారు. సోమవారం పాలమూరు యూనివర్సిటీలో భాగ్యరెడ్డి వర్మ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ దేశవ్యాప్తంగా కార్యాచరణ ప్రారంభించక ముందే తెలంగాణ, ఆంధ్రాలో నిమ్న వర్గాల అభ్యున్నతికి పాటుపడిన దార్శనికుడు అని పేర్కొన్నారు. హిందూమత సంస్కరణకు ఆయన చేసిన కృషికి ఆర్యసమాజం వారు వర్మ అనే బిరుదు ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం భాగ్యరెడ్డి వర్మ చిత్రపటం వద్ద యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గిరిజామంగతాయారు, ఓఎస్‌డీ మధుసూదన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కే ప్రవీణ, డైరెక్టర్ నూర్జహాన్, వెంకట్, రవీందర్ సిబ్బంది పాల్గొన్నారు.



పీయూలో నివాళులర్పిస్తున్న వీసీ, అధ్యాపక బృందం

## వార్డులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు..

**- పర్యవేక్షించిన మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మి**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 22, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్ తెలిపారు. సోమవారం 20,16వ వార్డుల్లో పారిశుధ్య ఏర్పాట్లను కౌన్సిలర్లు, సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ఇండ్ల మధ్య, ఓపెన్ ప్లాట్లలో పెరిగిన పిచ్చి మొక్కలను కార్మికులు తొలగించారు. డ్రైనేజీలను శుభ్రం చేశారు. ఇండ్ల మధ్య మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్యపరిరక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు చైర్‌పర్సన్ వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రమేశ్, ఉమాశంకర్‌గౌడ్, వార్డుకమిటీసభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, నాయకులు

## జిల్లా ఎస్పీలతో డిజిపి విడియో కాన్ఫరెన్స్

**నారాయణపేట ప్రతినిధి, మే 22 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర డిజిపి అంజనికుమార్ ఐపిఎస్ కమిషనర్లకు అన్ని జిల్లాల ఎస్పీలకు తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల సందర్భంగా విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ ఎన్నికల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుండి ఎన్నికల నామినేషన్లు, ఎన్నికలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలు, పోలింగ్ కేంద్రాలు, జిల్లా కలెక్టర్‌తో ముందస్తు కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించాలని, అన్ని శాఖలతో కలిసి సమన్వయంతో పని చేయాలని, పోలీసులు సమస్యాత్మక గ్రామాల సందర్శన, ఎన్నికల సందర్భంలో పోలీస్ బందోబస్తు, పోలీసులు చేయాల్సిన, చేయకూడని విషయాలపై డిజిపి సూచనలు ఇచ్చారు. ఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతై జిల్లా ఎన్నికల సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని పోలీసు అధికారులు, విలేజ్ పోలీస్ ఆఫీసర్లు అందరు గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (డిఎఆర్) నాగేంద్రుడు, డీఎస్పీ సత్యనారాయణ, ఎస్సైలు రాములు, నవీన్, ఎస్‌బి స్టాఫ్ పాల్గొన్నారు.




విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ

## నేరుగా ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి, మే 22 ప్రభాతవార్త :** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి 8మంది ఫిర్యాదుదారులు వివిధ సమస్యలపై బాధితుల నుండి వచ్చిన ఆర్జీలను ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజావాణిలో బాధితుల ఫిర్యాదులపై ఆయా పోలీస్‌స్టేషన్‌ల అధికారులతో మాట్లాడుతూ పోలీస్‌పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలుతీసుకోవాలని ప్రత్యక్షంగా ఫోన్‌లోమాట్లాడి పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. అత్యవసర సమయంలో డయల్ 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

## ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ కె.సృజన

**గద్వాల ప్రతినిధి, మే 22 ప్రభాతవార్త :** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్‌శాఖ చిత్తశుద్ధితో పని చేస్తుందని, బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ కె. సృజన అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన 15 ప్రజా ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజావాణిలో బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడుతూ, పోలీసు పరిధిలోని ప్రతి అంశాన్ని పరిష్కరించడం, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదుదారులు సివిల్ వివాదాలను కోర్టులోనే పరిష్కరించుకోవాల్సిందిగా వారికి సూచించారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని తెలియజేస్తూ చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతల పరిస్థితులకు భంగం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదులలో భూ వివాదాలకు సంబంధించి 9ఫిర్యాదులు అందగా వాటిలో మిస్సింగ్‌కు సంబంధించి 02 ఫిర్యాదులు, గొడవలకు సంబంధించి 1, సైబర్‌క్రైమ్‌కు సంబంధించి1, ఇతరఅంశాలకు సంబంధించి 2ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

## వివాహ వేడుకల్లో పాల్గొన్న రంజిత్‌కుమార్

**కెటిదొడ్డి, మే22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొండాపురం గ్రామం లో ఎలీషా వెడ్స్ అనిత వివాహ మహోత్సవానికి నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలి పారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పాల్గొన్నారు.



# క్రీడాకారులు లక్ష్యంతో ముందుకెళ్లాలి:ఎక్సైజ్‌శాఖ మంత్రి

### జిల్లాస్థాయి సీఎం క్రీడా కప్ పోటీలు ప్రారంభం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 22 ప్రభాతవార్త :** క్రీడాకారులు ఒక ఆశయాన్ని, లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ముందుకు వెళ్లాలని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. సీఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా సోమవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్టేడియంలో 3 రోజులపాటు నిర్వహించనున్న సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక మంచి క్రీడా పాలసీని తీసుకురావడం జరిగిందని, 18 క్రీడలలో సీఎం కప్ క్రీడా పోటీలను గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులు ఒక ఆశయం, లక్ష్యంతో కృషి చేస్తే మంచిపేరు సంపాదించుకోవచ్చని అన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధిలో భాగంగా 16వేల గ్రామాలలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశామని, ఉద్యోగాలలో క్రీడలకు రెండుశాతం రిజర్వేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత తమదన్నారు. 2014కుముందు మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ స్టేడియంను ఇప్పటి స్టేడియంతో పోల్చి చూసుకోవాలని, జిల్లాకు వాలీబాల్ అకాడమి తీసుకురావడమే కాక హాస్టల్ సైతం తీసుకొచ్చామని అన్నారు. త్వరలోనే సింథటిక్ గ్రౌండ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఎంవిఎస్ కళాశాలలో నిర్మాణంలో ఉన్న గ్రౌండ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులతో కోరారు. వచ్చే సంవత్సరం ఇంకా పూర్తి స్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తానని, ఈనెల 28 నుండి 30 వరకు 10 వేల మందితో రాష్ట్రస్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు ఎంతో భవిష్యత్తు ఉందని, బాగా కష్టపడి వారిప్రతిభను చూపిస్తే తల్లిదండ్రులకు, రాష్ట్రానికి, జాతీయ స్థాయిలో కూడా మంచిపేరు వస్తుందని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఇందుకు ఉదాహరణ నికత్ జరీనా అని, ఆమెకు 20 కోట్ల రూపాయల విలువ చేసే స్థలంతో పాటు, నేరుగా డీఎస్పీ ఉద్యోగం త్వరలోనే ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మహబూబ్‌నగర్ పట్టణం అభివృద్ధిలో భాగంగా శిల్పారామం, నెక్లెస్‌రోడ్, మిని ట్యాంక్‌బండ్ వంటి ఎన్నో అభివృద్ధి చేశామని అన్నారు. నెక్లెస్ రోడ్డుకు స్టేడియం నుండి లింకు ఏర్పాటు చేయాలని అన్నారు. ఇండోర్ స్టేడియాన్ని త్వరలో పూర్తి చేయాలని ఆయన కోరారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కప్ క్రీడా పోటీలలో గ్రామీణ ప్రాంతాలలోని మట్టిలోని మాణిక్యాల లాంటి క్రీడాకారులను వెలిసి తీయవచ్చని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో క్రీడలకు క్రీడల శాఖ మంత్రి ఆధ్వర్యంలో ఎంతో మార్పు తీసుకురావడం జరిగిందని, సీఎం కప్ క్రీడా పోటీల సందర్భంగా జిల్లాలో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో ముందుంచాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి వరకు క్రీడాకారులకు అవకాశం కల్పించే విధంగా సీఎం కప్ క్రీడలను వివిధ దశల్లో నిర్వహించడం జరిగిందని, వారిప్రతిభను మెరుగు పరచుకునేందుకు ఇది చక్కటి అవకాశం అని అన్నారు. మండల స్థాయిలో జిల్లాలో సీఎం కప్ క్రీడా పోటీల సందర్భంగా 4360 మంది పాల్గొనగా జిల్లా స్థాయిలో 1000 మంది పాల్గొంటున్నారని, జిల్లా స్థాయిలో బాగా రాణించిన వారికి రాష్ట్ర స్థాయికి తీసుకు వెళ్లేందుకు మంచి అవకాశం ఉందని, ఇదే కాకుండా రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారికి లక్ష రూపాయలు 75 వేలు, 25 వేలు బహుమతులు ఉన్నాయని, అలాగే వ్యక్తిగతంగా 20 వేలు, 15 వేలు, 10 వేలు అవార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. వీటన్నింటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జిల్లా ఎస్పీ కె. నరసింహ, మున్సిపల్ ఛైర్మన్ కెసి నరసింహులు, ముడా ఛైర్మన్ గంజి వెంకన్న, జిల్లా రైతుబంధు కో ఆర్డినేటర్ గోపాల్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటి ఛైర్మన్ రహమాన్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, డీఈఓ రవిందర్, కౌన్సిలర్లు రమ్‌లక్ష్మణ్, కో ఆప్షన్ సభ్యులు రామలింగం, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**గద్వాల ప్రతినిధి, మే 22 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లాకలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను, తహసిల్దార్‌లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల ద్వారా 135 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ప్రజలనుండి వచ్చిన ఫిర్యాదులలో ఆసరా పెన్షన్‌కు సంబంధించి 12 దరఖాస్తులు, భూ సమస్యలపై 114 దరఖాస్తులు, భూ సర్వేకు సంబంధించి 5 దరఖాస్తులు, ఇతర సమస్యలపై 4 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖల జిల్లా అధికారులు సంబంధిత మండల అధికారులతో చర్చించి వారి పరిధిలోని దరఖాస్తులు పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తున్న ప్రతి ఒక్కరి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలంపూర్, రాజోలి, వడ్డేప ల్లి, ధరూర్ మండలాల ప్రజలు ఇచ్చిన భూ సమస్యలపై ఫిర్యాదు లను పరిశీలించి ఆయా మండలాల తహసిల్దార్‌లతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఆర్డీఓ రాములు, ఏఓ యాదగిరి, సూపరింటెండెంట్ రాజు, మదన్‌మో హన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

## సీఎం కప్ క్రీడలను ప్రారంభించిన జడ్పీ ఛైర్‌పర్సన్..

**నారాయణపేట ప్రతినిధి, మే 22 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి సీఎం జిల్లాస్థాయి క్రీడా పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లాస్థాయి క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలలోని క్రీడాకారులు క్రీడల పట్ల ఆసక్తి, ప్రతిభను కనబర్చి జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారుల కోసం ప్రాధాన్యత కల్పించిందని అన్నారు. క్రీడాకారులకు భోజనం, ఇతర సదుపాయాల కోసం 25 వేల రూపాయల ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణాలకు పరిమితమైన క్రీడలను గ్రామస్థాయి నుండి ప్రోత్సహించేందుకు గ్రామస్థాయి నుండి ప్రోత్సహించేందుకు గ్రామస్థాయిలో క్రీడాకారులను గుర్తించి ఆణిముత్యాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామ స్థాయిలో క్రీడా ప్రాంగణాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సీఎం కప్ టోర్నమెంట్‌లు గ్రామ స్థాయిలో నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొని, జిల్లాస్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయికి పంపించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ క్రీడాకారులుగా గెలుపొంది సీఎం కప్ సాధించాలని ఎమ్మెల్యే కోరారు. క్రీడాకారులకు అవసరమైన భోజనం ఏర్పాట్లకు రూ. 59 వేలు అందజేశారు. ఉద్యోగ నియామకాల కింద క్రీడాకారుల కోటా కింద 2 శాతం రిజర్వేషన్ ఉందని తెలిపారు. క్రీడాకారులకు తన సహకారం ఉంటుందని అన్నారు. అనంతరం క్రీడా జెండా ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం వివిధ మండలాల నుండి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని కబడ్డీ, వాలీబాల్ ఆటలను ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం దగ్గర రూ. 45 లక్షలతో నిర్మించే బస్ షెల్టర్ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనసూయ, వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్‌పర్సన్ జ్యోతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, ఎస్పీ వెంకటేశ్వర్లు, డివైఎస్ఓ కృష్ణమాచారి, స్థానిక ప్రజా ప్రతినిధులు, పిఈటిలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్లు రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 22 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా రైస్ మిల్లర్లు చిన్న యంత్రాలు పెట్టి క్వింటాల్‌కు ఎంత బియ్యం వస్తుందనే బేరీజు వేయడానికి వీలు లేదని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో రైస్ మిల్లర్లు కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం దించుకోవడం లేదని, రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక శాసన సభ్యులు మర్రి జనార్ధన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి జిల్లాలోని రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌ఫోర్ట్ కాంట్రాక్టర్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల యజమానులు, పీఎసీఎస్ డైరెక్టర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. మిల్లర్లు చిన్న యంత్రాలతో బియ్యం తీసి అవుట్ కమ్ బియ్యం చాలా తక్కువ వస్తుంది కాబట్టి క్వింటాలుకు 9కిలోలు, 10 కిలోలు తగ్గించి తీసుకుంటాం లేకుంటే ధాన్యం లారీ నుంచి దింపుకోమని రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసారి వరి పంటకు రోగం వచ్చి ఇప్పటికే నష్టపోయారని, వారిని మరింత ఇబ్బందులకు గురి చేయవద్దని మిల్లర్లు సహకరించాలని కోరారు. ధాన్యంలో కొంత తాలు వస్తున్నందున క్వింటాల్‌కు గరిష్టంగా 2 కిలోల కంటే ఎక్కువ కట్ చేయడానికి వీలు లేదని ఆదేశించారు. విస్తృత చర్చ అనంతరం రైతులకు, ప్రభుత్వానికి ఇబ్బందులు కల్పించకుండా కలెక్టర్ సూచనల మేరకు గరిష్టంగా క్వింటాల్‌కు 2 కిలోల తగ్గింపుతో బియ్యం తీసుకోవడానికి అందరు రైస్ మిల్లర్లు ఒప్పుకున్నారు. మిల్లుల వద్ద ఉన్న ధాన్యం వెంటనే దింపుకుంటామని ఇక ముందు పొరపాట్లు చేస్తామని ముక్తకంఠంతో అంగీకరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఎస్ఓ మోహన్‌బాబు, ఆర్‌టీఓ ఏర్రిస్వామి, పీడీడీఆర్‌డీఓ నర్సింగ్‌రావు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు జూలూరి రమేష్‌బాబు నరేష్, రాజేష్, సుధాకర్‌రావు, సింగిల్‌విండో డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

## అర్హులందరికి నగదు బదిలీ పథకం వర్తింపజేయాలి

**గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిల్లెగోపాల్**

**గద్వాల ప్రతినిధి, మే 22 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా వ్యాప్తంగా అర్హులైే గొల్ల కురువలకు రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా నగదు బదిలీ చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిల్లో గోపాల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కన్వీనర్ జికె ఈదన్న అధ్యక్షతన లబ్దిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో అక్రమాలు జరిగి లబ్దిదారులకు సరైన న్యాయం జరగకపోవడం అనేక అక్రమాలకు తావివ్వడం మధ్యవర్తుల వల్ల లబ్దిదారులు నష్టపోయారని నాణ్యతలేని గొర్రెలను పంపిణీ చేయడం వల్ల మార్గం మధ్యలోనే చనిపోవడం, చనిపోయిన వాటికి సరైన ఇన్సూరెన్స్ కల్పించకపోవడంతో తీవ్రంగా నష్టపోవడం జరిగిందని, రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలంటూ అనేక రోజులుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నా ఏమీ పట్టనట్లు గొర్రెల కాపరులను మోసం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు జికె ఈదన్న, దేవన్న, జి. రాజు, మల్లేష్, గజేందర్, తిమ్మప్ప, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే చీఫ్ మినిస్టర్ కప్ క్రీడలు..

**-నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 22 ప్రభాతవార్త:** గ్రామీణ క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే చీఫ్ మినిస్టర్ కప్ క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్ తెలిపారు. సోమవారం నాగర్‌కర్నూల్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్ కప్ జిల్లా స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు 20 మండలాల నుంచి 86జట్లకు మూడు రోజుల పాటు క్రీడలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నారని ఆయన తెలిపారు. వాలీబాల్, కబడ్డీ పోటీల్లో విద్యార్థులతో కలిసి జిల్లా యువజన సర్వీసు క్రీడల అధికారి నటరాజు , అదనపు కలెక్టర్ మోతిలాల్‌లు ఆటలు ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి పాండు, రాష్ట్ర స్థాయి అబ్జర్వర్ యాదయ్యగౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు సీతరాంనాయక్, శేఖర్, స్వరూప, మనీ, జ్ఞానేశ్వరి, పర్వతాలు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలి

**రాష్ట్ర వ్యవసాయ కమిషన్ కార్యాలయ అధికారి సచిన్ దత్**

**అయిజ, మే 22 ప్రభాతవార్త :** రాష్ట్రంలో అత్యధిక శాతం కాటన విత్తన ఉత్పత్తి జరిగేది జోగులాంబ గద్వాల జిల్లాలో అని ఇందులో భాగంగానే కాటన్ ఉత్పత్తి చేసి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ కార్యాలయ అధికారి సచిన్ దత్తు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సోమవారం అయిజ పట్టణంలోని పలు కాటన్ మిల్లులను స్థానిక వ్యవసాయ అధికారులు ఎడిఏ చక్రినాయక్, శాంతినగర్ సిఐ శివశంకర్‌గౌడ్‌లతో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా జిన్నింగ్ మిల్లులో ఉన్న సీడ్ విత్తనోత్పత్తి విత్తనాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం విత్తనోత్పత్తి విత్తనాలను మార్పిడి చేసి శాంపుల్స్‌ను సేకరించారు. వారి వెంట సీడ్ సర్టిఫికేషన్ అధికారి శివకుమార్, ఏఓ శంకర్‌లాల్, ఏఈఓ ఉన్నారు.

## అక్షర స్కూల్ బస్సు దహనం..?

**- జడ్చర్ల మండల కేంద్రంలో ఘటన**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 22, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ కేంద్రంలోని పద్మావతీ కాలనీలో ఉన్న అక్షర కాన్సెప్ట్ స్కూల్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. ఎవరో గుర్తు తెలియని దుండగులు కావాలనే స్కూల్ బస్సుకు నిప్పు పెంటి ఉంటారని సిబ్బంది, కుటుంబ సభ్యులు చెబుతున్నారు. బస్సులో పాఠశాలకు సంబంధించిన బ్రోచర్లు, పాంప్లెట్స్ ఉన్నాయని చెప్పారు. వాటికి నిప్పు పెట్టి ఉంటారని అందుకే పెద్ద ఎత్తున మంటలు చెలరేగి బస్సు పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు. బస్సులో మంటలు చెలరేగి పొగలు రావడంతో చుట్టు పక్కల వారు చూసి తమకు సమాచారం ఇవ్వడంతో బస్సు దగ్గరకు చేరుకునే లోపే 50శాతం దగ్ధమైందని వెంటనే గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. ఫైర్ ఇంజిన్ వచ్చే వరకు బస్సు 90శాతం కాలిపోయిందని సిబ్బంది వెల్లడించారు. ఇదిలా ఉండగా గత ఏడాది కూడా ఇదే నెలలో ఇలాగే ప్రమాదం జరిగిందని, సీసీ కెమెరాలో దుండగులను గుర్తించినప్పటికీ పోలీసులకు ఫిర్యాదు చేయలేదని, ఈసారి అనుమానం ఉన్నవారిపై తప్పక ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కావాలనే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ప్రిన్సిపాల్ సమయానికి అందుబాటులో లేనందునా ఫిర్యాదు చేయలేదని, పూర్తి సమాచారంతో అనుమానం ఉన్న పేర్లతో సహా ఫిర్యాదు చేస్తామని సిబ్బంది తెలిపారు.



## శ్రీ కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు

**చిన్నచింతకుంట, మే 22 ప్రభాతవార్త :** పేదల తిరుపతిగా పేరు గాంచిన శ్రీ కురుమూర్తి స్వామి హుండీని సోమవారం లెక్కించారు. స్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తజనం కానుకల రూపేణా హుండీలో వేసిన నగదును ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి సమక్షంలో హుండీని లెక్కించగా రూ. 6,72,549 ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి పునః ప్రతిష్ట పూజలు

**వెల్దండ, మే 22 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామంలో బొడ్రాయి పునః ప్రతిష్ట పరమేశ్వరుడి, నందీశ్వర విగ్రహా ప్రతిష్ట పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పూజాల్లో భాగంగా మృగశిర నక్షత్రయుక్త మిథున లగ్న సుముర్తహుమున విగ్రహా యంత్ర ప్రతిష్ట, ప్రాణప్రతిష్టతో పాటు బలిపూర్ణహుతి, ఆశీర్వచనం, బోనాలను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్సీ కసిరెడ్డినారాయణరెడ్డి, ఐక్యత ఫౌండేషన్‌ఛైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిలు హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. సర్పంచ్ పొనుగోటి వెంకటేశ్వర్‌రావు శాలువాలతో ఘనంగా సన్మానించారు. బొడ్రాయిపండుగతో గ్రామంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ భాస్కర్ రావు, ఎంపీటీసీ రాములు, నాయకులు రాజుచారి, సంజీవ్‌కుమార్ యాదవ్, అలీ, సురేందర్‌రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ ప్రమాదంలో కాడేద్దు, గేదె మృతి...

**వెల్దండ, మే 22 ప్రభాతవార్త:** మండలపరిధిలోని బొల్లంపల్లి, తిమ్మినోనిపల్లి గ్రామాల్లో వేర్వరు చోటు చేసుకున్న విద్యుత్ ప్రమా దంలో కాడేద్దు, గేదెలు మృతిచెందాయి. వివరాల్లోకి వెళితే... తి మ్మినోనిపల్లి గ్రామానికి చెందిన ఎల్గాన్కాన్‌పేట జంగయ్య వ్యవసా య భూమిని కౌలుకు తీసుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. గేదే మేత మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగకు తగిలి విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందినది. అదే విధంగా బొల్లంపల్లి గ్రా మానికి చెందిన ముంత అంజయ్య వ్యవసాయ పొలంలో కాడేద్దు విద్యుత్ వైరుకు తగిలి మృతి చెందినది. కాడేద్దు, గేదెలు మృతి చెందడంతో రైతులు బోరున విలపించారని ప్రభుత్వ పరంగా వారిని ఆదుకోవాలన్నారు.

## ఘనంగా బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్టాపన

**కోయిల్‌కొండ, మే 22 ప్రభాతవార్త :** మండల కేంద్రమై కోయిల్‌కొండలో గత మూడు రోజుల నుండి బొడ్రాయి ఉత్సవ వేడుకలు ఎంతో వైభవోపేతంగా నిర్వహించబడ్డాయి. సోమవారం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని తెలుగు వీధిలో గల ఆంజనేయస్వామి దేవాలయం ముందు ధ్వజస్తంభ ప్రతిస్టాపన కార్యక్రమంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా గావించారు. అనంతరం సాయంకాలం బోనాలతో ఊరేగింపుగా బొడ్రాయి అమ్మవారి దగ్గరకు చేరుకుని అక్కడ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ దేవత అయిన పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మంద జగన్నాథం జన్మదిన వేడుకలు

**ఇటిక్యాల, మే 22 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొందేరు గ్రామంలో ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద జగన్నాథం వేడుకలను ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను మంద జగన్నాథం కేక్ కట్‌చేసి అలంపూర్ టిఆర్ఎస్ కార్యకర్తల మధ్య జరుపుకున్నారు. ఈసందర్భంగా జడ్పీ ఛైర్మన్ సరిత, మాజీ జడ్పీ ఛైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ పటేల్ విష్ణువర్ధన్‌రెడ్డి, పెబ్బేరు జడ్పీటిసి పద్మ, నతానేలు, ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద జగన్నాథంను జన్మదినం సందర్బంగా శాలువా, పూలమాలలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ, వడ్డేపల్లి మాజీ జడ్పీటిసి శ్రీనివాసులు, ఆత్మలింగారెడ్డి, పల్లెపాడు శంకర్‌రెడ్డి, చంద్రగౌడ్, అంజి, రామ్‌రెడ్డి, దానం కుర్వ పుల్లయ్య, ఆయా గ్రామాల కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# క్రైస్తవుల సంక్షేమానికి కృషి సల్పుతా : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి దృశ్యం

**రామచంద్రాపురం, మే 22, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని అన్ని వర్గాల వారి సంక్షేమానికి తన వంతు కృషి సల్పుతున్నానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలో సువార్త ప్రతిధ్వని మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపవాస ప్రార్థన ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అములులో క్రైస్తవులకు తగు ప్రదాన్యత ఇస్తున్నట్లు గుర్తు చేశారు. పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం గ్రామ పరిధిలో చర్చి నిర్మాణానికి 200 గజాల స్థలాన్ని త్వరలోనే కేటాయిస్తామని భరోసా చేశారు.

**రంగ్రేజ్ కులస్థుల అభివృద్ధికి అండగా ఉంటా**

నియోజకవర్గంలోని రంగ్రేజ్ కులస్థుల అభివృద్ధికి అండగా ఉంటానని, వారి సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తానని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డి నగర్ కమ్యూనిటీ హాల్‌లో భవసార్ క్షత్రియ సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తుల్జా భవాని గొందాళ్ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంగ్రేజ్ కులస్థుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 50 లక్షల రూపాయలు, అర ఎకరం స్థలం కేటాయించారని గుర్తు చేశారు. త్వరలోనే కమ్యూనిటీ హాల్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హామి చేశారు. ప్రభుత్వ పథకాల అమలులోనూ రంగ్రేజ్ కుటస్థులకు తగు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో కార్పోరేటర్లు పుష్పనగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డి, మంజుల రఘునాథరెడ్డి, మాజీ ఎంపిపి యాదగిరి యాదవ్, మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య యాదవ్, సమాజం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ జైతనే, నియోజకవర్గ అధ్యక్షులు పతంగే విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి దీపక్‌కుమార్, బిఆర్‌ఎస్ సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్ పాల్గొన్నారు.



రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్‌ను సన్మానిస్తున్న రాజు దృశ్యం

## చైర్మన్‌ను సన్మానించిన రాజు

**సదాశివపేట, మే 22, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమైఖ్య చైర్మన్ పిట్టల రవీందర్‌ను ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్య క్షులు పులిమామిడి రాజు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పులిమామిడి రాజు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులు పిట్ల ల రవీందర్‌కు సముచిత స్థానం కల్పించి ముదిరాజ్‌లు ఆనంద పడేలా ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు న్యాయం చేశారని ఆనందం వ్యక్తం చేశారు. రానున్న శాసన సభ ఎన్నికల్లో ముదిరాజ్‌లకు అవకాశం కల్పించాలని, శాసన సభలో ముదిరాజ్‌ల గోడు వినిపించే వారు లేక ముదిరాజ్‌లు వెనుకబడి పోతు న్నారని విచారం వ్యక్తం చేశారు. డాక్టర్ బండ ప్రకాష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసిఆర్ దృష్టికి ముదిరాజ్‌ల విన్నపాలు తీసుకుపోయినట్లు, సిఎం సానుకూలంగా స్పందించినట్లు పులిమామిడి రాజు వివరించారు.

## ప్రత్యేక బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, మే 22, ప్రభాతవార్త :** మల్కాజిగిరి, ఈసీఐఎల్, నాగారం, ఎస్‌రావునగర్, కుషాయిగూడ నుంచి కొమురవెల్లి దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యంగా సోమవారం కొమురవెల్లి మండల కేంద్రంలో ప్రత్యేక బస్సును అలయ చైర్మన్ గీస బిక్షపతి, జడ్పీటిసి సిద్దప్ప చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో అలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, దేవాలయ పర్యవేక్షకులు నీల శేఖర్, అలయ సిబ్బంది, సర్పంచ్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**-కార్పోరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి**



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కార్పోరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, మే 22, ప్రభాతవార్త:** స్వయం ఉపాధి పనులతో మహిళలు ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందని భారతీ నగర్ కార్పోరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి అన్నారు. సోమవారం భేల్ టౌన్ షిప్‌లో సత్యసాయి బాబ ఆలయంలో సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అధునాతన టైలరింగ్, జ్యూట్ బ్యాగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లపై శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది మహిళలకు కార్పోరేటర్ సర్టిఫికెట్లు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని గుర్తు చేశారు. మహిళలకు వడ్డీలేని రుణాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో భేల్ సమితి కన్వీనర్ రాంగోపాల్, మహిళ ఇంచార్జి ఇందిరా, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఉన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారాన్నికి కృషి చేస్తా

**ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులు సంతోష్ కుమార్**

**కొడిపల్లి, మే 21, ప్రభాతవార్త :** గత కొన్ని నెలలుగా మండల పాత్రికేయులు ఇండ్ల స్థలాల పంపిణిపై జరుగుతున్న తీవ్ర జ్యాపానికి గల కారణాలను తెలుసుకుని త్వరలోనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను ఇప్పించి, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కారించుటకు తన వంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నుకోబడిన కౌడిపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంపటి సంతోష్ కుమార్ హామి ఇచ్చారు. శనివారం నాడు రాత్రి స్థానిక ఎమ్మెల్యే చిలుముల స్వగృహంలో కౌడిపల్లి నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు సంతోష్‌కుమార్ విలేకర్లతో మాట్లాడుతు కౌడిపల్లి మండల పాత్రికేయు లకు అతి త్వరలోనే ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇండ్ల స్థలాల పట్టాలను పంపిణి చేయిం చితీరుతానని అన్నారు. అలాగే జర్నలిస్టులకు ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ ఫలాలను నిస్పాక్షపాతకంగా అందరికి అందేలా చూస్తానని ఆయన అన్నారు. కాగా కౌడిపల్లి నూతన కార్య వర్గంను తొటి మిత్రులతో ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు. అధ్యక్షులుగా అంపటి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సంధ్యగల్ల మల్లేశం, కోశాధికారిగా పొన్నం మనోహార్ గౌడు, సంయుక్త కార్యదర్శిగా చంద్రం సుభాష్ గౌడు, ఉపాధ్యక్షులుగా అయ్యప్పగారి సత్యాగౌడు, గౌరవ అధ్యక్షులుగా బోడ్డు పెంటయ్య, గౌరవ సలహాదార్లుగా గుడ్డంల దుర్గయ్య, చేప్యాల రాయగిరి, మటూరి లక్ష్మినారాయణ, చిన్నచెంది రవిగౌడు, హన్మగోని దశరథ్ గౌడు, ప్రచార కార్యదర్శిగా ఎం. డి.అన్వర్, కార్యవర్గ సభ్యులుగా గౌండ్ల శేఖర్ గౌడు, ప్రశాంత్, కుమార్, శరత్, ఉదయ్ తదితరులు కలరు.

## పిడుగుపాటుకు దూడ మృతి



మృతి చెందిన ఆవు దూడ

**నంగునూర్, మే 22, ప్రభాతవార్త:** పిడుగుపాటుకు దూడ మృతి చెందిన ఘటన నంగునూర్‌లో సోమవారం తెల్లవారుజామున చోటు చేసు కుంది. గ్రామస్తులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన గడబోయిన మల్లయ్య వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రోజు మాదిరిగా తన ఆవులను వ్యవసాయ బావి వద్ద కట్టేసి అదివారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. సోమ వారం తెల్లవారుజామున ఈదురు గాలులు, భారీ శబ్దాలతో కూడిన పిడుగు పాటుకు పాలు తాగే దూడ అక్కడికక్కడే మృతి చెందింది. తెల్లవా రుజామున పాలు పితకడానికి వచ్చిన మల్లయ్యకు మృతి చెందిన లేగ దూడ కనిపించింది. ప్రభుత్వం అదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**పాప్‌స్టార్ కింగ్‌తో రాజ్‌షమాని ప్రొగ్రన్స్ రేంజ్ బ్లాంకో ఒప్పందం**

అందరికి సుపరిచితమైన పేరు క్రియేటర్లకు 7 రోజుల్లో బ్రాండ్లను సృష్టిస్తూతన ప్రయాణాన్ని మొదలుపెట్టింది. మొదటి టెక్ ప్లాటా ఫ్రమ్ అయిన హౌస్ ఆఫ్ ఎక్స్ ఇప్పుడు వినియోగదారుల కోసం డీ2సీ బ్రాండ్లను లాం చ్ చేయడానికి సిద్ధమైంది. ప్రముఖ భారతీయ పాప్‌స్టార్ కింగ్‌తో చేతులు కలిపింది. అందులో భాగంగా మొట్టమొదటి బ్రాండ్ లాంచ్ చేసింది. అదే బ్లాంకో పాప్‌స్టార్ కింగ్ ఆలోచనల్లోంచి పుట్టింది. తన సంగీతంలో ప్రపం చవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సొంతం చేసుకున్న కింగ్ ఇప్పుడు సరికొత్త ప్రయాణానికి నాది పలికాడు.

## తనికినల్ల పోచమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

**-రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి**

**కౌడిపల్లి, మే21, ప్రభాతవార్త:** తెలంగాణ రా ష్ట్రంలోని మెదక్ జిల్లాలో రెండవ అతి పెద్ద జాతరగా పేరు గాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర మహిళ కమీషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నాడు నియోజక వర్గంలోని పలు కళ్యాణోత్సవాత్స శభ కార్యాలను సందర్శించి నూతన వధువు వరులను ఆశీర్వాదించిన తర్వాత తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయాని ఆమె సందర్శించినారు. ఆలయ ప్రధాన అర్చకులు, దేవాదాయ ధర్మదాయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పల్కిన్నారు. రాష్ట్ర మహిళ కమీషన్ చైర్ పర్సన్ శ్రీ నల్ల పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి సందర్శించినందుకు ప్రధాన అర్చకులు శివప్ప రాష్ట్ర మహిళ కమీషన్‌కు శాలువాతో ఘనంగా సనా ్మనించారు. ఆదివారం నాడు ప్రభుత్వ సెలువు దినం, మరో ప్రక్క విద్యార్థులకు వేసవి కాలపు సెలవు దినాలు అయ్యినందున ఆలయం అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకులు ఉదయానే శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం చేసి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, కుంకుమార్చన చేసిన తర్వాత భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించగా భక్తులు ఓడి బియ్యం పోసి, ప్రత్యేక పూజలు నిర వ్యహించి, తమ మొక్కులను తీర్చుకొవడానికి పెద్ద సంఖ్యలో హాజరైనారు. భక్తులు శివసత్తుల విన్యాసాల నడుమ భక్తులు బోనాలను డప్పు చప్పులతో ఆలయం చుట్టు ఊరేగించి, భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మ వారికి బోనం నైవేద్యం సమర్పించి, జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఓ బి. మోహన్ రెడ్డి తన సిబ్బంది సహాకారంతో గర్భ గుడిలోకి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే ఆలయం వద్ద విచ్చేసిన భక్తులకు ఏలాంటి అసౌర్యాలు కల్గకుండ ఈఓ తన సిబ్బందితో మౌళిక వసతులు కల్పించారు. వేసవి కాలం సమీస్తున్నందున భక్తులకు త్రాగునీటి సమస్య రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓ తెలిపారు. ఈ కార్య క్రమంలో తునికి గ్రామ ఉప సర్పంచ్ కొండల్‌రెడ్డి, ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, గ్రామ పెద్దలు బండి సాయాగౌడు, నర్సా పూర్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్, సత్యనారాయణ గౌడు, భక్తులు పెద్ద సంఖ్య పాల్గొన్నారు.

## వేంకటేశ్వర ఆలయంలో నవగ్రహ ప్రతిష్ఠాపన



లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

**సదాశివపేట, మే 22, ప్రభాతవార్త:** మండలంలోని కంబాలపల్లి గ్రామంలో అతిపురాతనమైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ఆవరణలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పట్నం విజయలక్ష్మి సుభాష్ తన స్వంత ఖర్చులతో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ పట్నం విజయలక్ష్మి సుభాష్ మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరు కొంత సమయాన్ని దైవ కార్యక్రమాలకు నిత్యం కేటాయించాలని సూచించారు. విగ్రహ ప్రతిష్టాపన పూజ కార్యక్రమాలకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దగొల్ల శ్రీహరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గడీల రాంరెడ్డి, మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, మాజీ ఎంపిపి అధ్యక్షులు మల్లమ్మ, మాజీ సొసైటీ చైర్మన్ కోడూరు రమేష్, ఉప సర్పంచ్ సుభాష్, సదాశివపేట పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తుల్జారాం, మాజీ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ మంతూరి అనిల్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, చీమలదరి సుభాష్, మల్లేశం, పట్నం సురేందర్, భుజంగం, శ్రీశైలం,నరసింహారెడ్డి, గ్రామ కార్యదర్శి బసవరాజ్, ఆలయ పూజారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెల పంపిణీ



పుస్తెమెట్టెలు అందజేస్తున్న మైనంపల్లి సోషల్ సర్వీస్ సభ్యులు

**రామాయంపేట, మే 22, ప్రభాతవార్త :** మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రామాయంపేట మండల పరిధిలోని ఝాన్సీలింగాపూర్ గ్రామంలో నవవదువుకు పుస్తెమట్టెలు పంపిణీ చేశారు. సోమవారం నాడు ఎంఎస్ఎస్‌వో చైర్మెన్ మైనంపల్లి రోహిత్ ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలైన నర్సగల్ల స్వరూప, కీ.శే. స్వామి కూతురైన సునీతతో పాటు అదే గ్రామానికి చెందిన బండమీది గంగవ్వ, ఆశయ్య కూతురు శిరీషల వివాహానికి మైనంపల్లి సర్వీస్ ఆర్గనైజేషన్ తరపున పుస్తెమట్టెలు పంపిణీ చేయడం జరిగింది. ఆర్గనైజేషన్ మండల యూత్ అధ్యక్షుడు వగ్గు శ్రీకాంత్ సాగర్, సభ్యులు ఇప్ప రవితేజ, చింటు శ్రీకాంత్, సాయాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ఇప్ప భూపాల్, ప్రవీణ్‌గౌడ్, నవీన్‌గౌడ్, బయ్యగారి ప్రవీణ్, జార్జిరెడ్డి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పారిశుధ్య నివారణకు చర్యలు : కౌన్సిలర్ దేమె యాదగిరి

**రామాయంపేట మున్సిపాలిటీ, మే 22, ప్రభాతవార్త :** వార్డులోని పారిశుధ్య నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు కౌన్సిలర్ దేమె యాదగిరి అన్నారు. సోమవారం నాడు వార్డులో వారోత్సవాలను ప్రారంభించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాబోయే వర్షాకాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ఉండడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా మున్సిపల్ ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అనంతరం వార్డులో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలంగించారు. మురికి కాలువలను శుభ్రపరిచారు. శానిటరీ జవాన్ పోచమ్మల శంకర్ పాల్గొన్నారు.




పారిశుధ్య వారోత్సవాలను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ దేమె యాదగిరి



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న దృశ్యం

## పెద్దమాసాన్‌పల్లిలో ఘనంగా ఎల్లమ్మ బోనాలు

**తొగుట, మే 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దమాసాన్‌పల్లిలో ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ కార్యక్రమం గౌడ సంఘం అధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం పుట్టకు దని పోయడం, కొత్త బంగారు తెచ్చుట ఎరుకాల బుట్ట, నాజర్ బోనం ఏడు అంతరాల బోనం ఘనంగా తీశారు. మహిమగల దేవత ఎల్లమ్మ కళ్యాణ మహోత్సంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. మూడు రోజుల పాటు అన్నదాన కార్య క్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

## సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కును సందర్శన

**తొగుట, మే 22, ప్రభాతవార్త:** మండల పద్మశాలి నాయకులు సోమవారం మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి అధ్వర్యంలో సిరిసిల్లలో పవర్ లూమ్ టెక్స్‌టైల్ పార్కును సందర్శించినట్లు పద్మశాలి సంఘం నాయకులు చిప్ప నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దుబ్బాక్‌లో పవర్ లూమ్ టెక్స్‌టైల్ పార్కును నిర్మించడానికి తన వంతు కృషి చేస్తానని ఎంపి హామీ ఇచ్చినట్లు తెలిపారు. పద్మశాలీలకు ఎంపి తన వంతు చేయూతనందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సి.హెచ్.లక్ష్మీనారాయణ, సిహెచ్ నారాయణ, సిహెచ్.గోపాల్, జి.అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన కంటి వైద్య శిబిరం

**తొగుట, మే 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చందాపూర్‌లో కంటి వెలుగు శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డు నరసింహులు సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని విజయవంతం చేసిన వైద్య సిబ్బంది, అశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ సిబ్బందిన ఘనంగా సత్కరించారు. శిబిరంలో 600 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 50 మందికి కంటి అపరేషన్‌కు రెఫర్ చేసినట్లు సర్పంచ్ తెలిపారు. 500 మంది కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, మే 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దకోడూరు, చిన్నకోడూరు, రామంచ గ్రామాలలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఎపిఎం మహిపాల్ సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అకాల వర్షంతో ధాన్యం తడకుండా కవర్లు కప్పి ఉంచాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలలో తగు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. లారీల కొరత ఉన్నచోట ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలించడం జరుగుతుందన్నారు. రైతులు విధిగా అధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, సాగు ధృవీకరణ పత్రం, పట్టా పాస్ బుక్‌లు వెంట తీసుకరావాలన్నారు. మండలంలోని 13 ఐకెపి కేంద్రాల ద్వారా 51914 క్వింటాళ్ల ధాన్యం 1081 మంది రైతుల నుంచి 151 లారీల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాముని ఉమేష్‌చంద్ర, సీసీలు శ్రీనివాస్‌రెడ్డి, కొమురయ్య, వివోఎలు లక్ష్మీ, అంజలి, తార, రాజు, ఎల్లం, కమిటి మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శం



కంటి వెలుగు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, మే 22, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న కంటి వెలుగు పథకం దేశానికే అదర్శంగా నిలుస్తుందని వైస్ ఎంపిపి కీసర పాపయ్య అన్నారు. మండల పరిధిలోని ఎల్లాయిపల్లిలో సోమవారం సర్పంచ్ మహేందర్‌తో కలిసి అయన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరాన్ని 18 యేండ్లు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అవసరం ఉన్న వారికి వెంటనే ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. రూపాయి ఖర్చు లేకుండా కంటి పరీక్షలు చేయడం జరుగుతుందని ఈ పథం వరం లాంటిదన్నారు. అనంతరం స్టీల్ బ్యాంకును ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకటేశం, నముండ్ల రామచంద్రం, ఎంపిడిఓ శ్రీనివాస్, సోమిరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి

**రాయపోల్,మే22 ప్రభాతవార్త**

చెరువులో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన రాయపోల్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. రాయపోల్ ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి గ్రామానికి చెందిన కాళ్ల క్రిష్ణ (30) వ్యవసాయం అలాగే వంటలు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల వారం రోజుల వ్యవధిలో అదే కులానికి చెందిన నర్సయ్య, లక్ష్మయ్యలు ఇద్దరు చనిపోయారు. వారి మొక్క దశదినకర్మ సందర్భంగా పెద్ద చెరువులోకి స్నానాలకు వెళ్లారు. స్నానం చేస్తూ క్రిష్ణ నీట మునిగి మృతి చెందాడు. మృతుని బార్య కాళ్ల బాగ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ తెలిపారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న న్యాయమూర్తి కుటుంబసభ్యులు

## కేతకి ఆలయంలో మహారాష్ట్ర న్యాయమూర్తి పూజలు

**ఝరాసంగం, మే 22, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీ దేవి సమేతంగా కొలువున్న శ్రీ కేతకి సంగమేశ్వర స్వామిని మహారాష్ట్ర సీనియర్ సివిల్ జడ్జి ఓం శంకర్ పాటిల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకుని న్యాయమూర్తి దంపతులను ఆలయ మర్యాదలతో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు చేసి తీర్ధ ప్రసాదాలు అందించారు. ఆలయ మర్యాదలతో న్యాయమూర్తి దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జహీరాబాద్ కోర్టు న్యాయవాది మాణిక్‌పాటిల్, ఆలయ అలయ అర్చకులు దిలీప్ కుమార్ జ్యోషి, జి బసవయ్య స్వామి, నాగయ్యస్వామి, వీరసంగయ్యస్వామి, కే సంగమేశ్వర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మున్నూర్ కాపు కార్యవర్గం

**చౌటకూరు, మే 22, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులో సోమవారం మున్నూర్ కాపు కార్యవర్గానిన ఏర్పాటు చేశారు. కార్యవర్గ అధ్యక్షులుగా ఆకుల రాములు, ఉపాధ్యక్షులుగా బాసర వెంకటేశం, కార్యదర్శిగా ఆకుల నాగయ్య, సంయుక్త కార్యదర్శిగా ఆకుల రమేష్, కోశాధికారిగా అభిలాష్, ఆకుల రమేష్, సభ్యులుగా ఆకుల రవి, ఆకుల లక్ష్మణన, రాజు, కాశయ్యలను ఎన్నుకున్నారు.

## రైతులకు సబ్సిడీ జనుము విత్తనాలు పంపిణీ

**న్యాల్‌కల్, మే 22, ప్రభాతవార్త:** మండలానికి సరఫరా అయిన జనుము విత్తనాలను సోమవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని డిసిఎంఎస్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు పంపిణి చేశారు. మండలానికి 100 బస్తాల జనుము విత్తనాలు సరఫరా అయిన విషయం పాఠకులకు విధితమే. 40 కిలోల జనుము బస్తా సబ్సిడీ కింద 1225 రూపాయలకు రైతులకు అందచేశారు. జనుము విత్తనాలు భూమిలో చల్లుకుంటూ భూసారం పెరుగుతుందని, ఫలితంగా పంటల దిగుబడులు పెరిగి రైతులు ఆర్థికంగా లబ్ధిపొందే అవకాశాలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి న్ లావణ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు బోడ స్వప్న, బిఆర్‌ఎస్ నాయకులు పడకంటి వెంకట్, ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

## ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



లారీలో ధానాన్ని తరలిస్తున్న నిర్వాహకులు

**చిన్నశంకరంపేట, మే22,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామంలో దాన్యం కొనుగోళ్లు పూర్తియ్యాయని నిర్వా హకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 200 మంది రైతులు వద్ద నుండి 4700క్వింటాళ్ల దాన్యంను సేకరించామని, సహకరించిన రైతులకు, గ్రామస్తులుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## కంటి వెలుగు శిబిరం ప్రారంభం

**చిన్నశంకరంపేట, మే22,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండల పరిధి కోర్విపల్లి గ్రామంలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ పద్మా ప్రారంభించారు. గ్రామస్థులు తప్పనిసరిగా కంటి పరిక్షలు చేయించుకోని ప్రభుత్వం ఉచితంగా అందించే కంటి అద్దాలను పొందాలన్నారు. ఉపసర్పంచ్ సంతోష్, నాయ కులు మల్లేషం కుమార్, రుక్మిని, యాదగిరి, లాలు, బాబు పాల్గొన్నారు.

## పుస్తెలు, మెట్టెల పంపిణీ

**చిన్నశంకరంపేట, మే22,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం కోర్విపల్లి గ్రామానికి చెందిన పోట్టిముత్యాలు, సాయమ్మల కూతురు వివాహం సోమవారం జరుగగా మైనంపల్లి సర్వీస్ ఆర్గనైజింగ్ చైర్మన్ మైనంపల్లి రోహిత్ పుస్తె మెట్టెలను పంపించగా పట్టణ సర్పంచ్ రాజిరెడ్డి వారికి అందించారు. కార్యక్రమంలో ప్రశాంత్, అంజయ్య, రాములు, సిద్దిరాంలు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా విజయ్ కుమార్

**మునిపల్లి, మే 22, ప్రభాతవార్త:** మండలం టిఆర్‌ఎస్ నూతన మండల అధ్యక్షుడిగా పెద్దలోడికి చెందిన మాజీ పిఏసీఎస్ చైర్మన్ వల్ల విజయ్‌కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా సోమవారం కంకోల్‌లో గల ఓఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా విజయ్‌కుమార్‌కు ఆందోలు ఎమ్మెల్యే చంటిక్రాంతికిరణ్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా నియమించిన విజయకుమార్‌కు బిఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడు విజయ కుమార్ మాట్లాడుతూ తనకు మునిపల్లి మండల పార్టీ అధ్యక్షుడిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా ప్రారంభమైన బొడ్రాయి ప్రతిష్ఠ



బొడ్రాయి ప్రతిష్ఠలో భాగంగా పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**మర్కుక్, మే 22 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని సిఎం దత్తత గ్రామం నర్స న్నపేటలో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్థానిక సర్పంచ్ మాధవి రాజిరెడ్డి, జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రంలు గ్రామస్తులతో కలిసి బొడ్రాయి వద్ద వేదపండితుల మంత్రోశ్చరణలతో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమం నాలుగు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, ఎల్లారెడ్డి, పర్వతాలు, మహిపాల్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, స్వామిరెడ్డి, అయిలయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**వాబాగ్ ఆర్థిక ఏడాది మిశ్రమ ఫలితాలు**

నీటిరంగంలో ప్రముఖ భారతీయ బహుళజాతి సాంకేతిక సంస్థ టెక్ వాబాగ్ లిమిటెడ్ మార్చిలో ముగిసిన నాల్గవ త్రైమాసికం మరియు సంవత్సరానికి ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. 99 సంవత్సరాలకు పైగా ఉన్న గొప్ప అనుభవంతో నీటి పరిశ్రమంలో ప్రపంచ అగ్రగామిగా ఉంది. ప్యూర్–ప్లే వాటర్ టెక్నాలజీ బహుళజాతి సంస్థ అయి నందున పురపాలక మరియు పారిశ్రామిక రంగాలలో టోటల్ వాటర్ సొల్యూషన్స్ కోసం పూర్తి స్థాయి సాంకేతికతలు మరియు సేవలను అందిస్తుంది.